navajyothinews.com

# నవజ్యోతి

తెలుగు దినపత్రిక




హరీశ్‌రావుపై పొంగులేటి
**ప్రశ్నల వర్షం**




సీఎంఆర్‌ఎఫ్‌తో బాధితులకు
**ఆర్థిక భరోసా : హోంమంత్రి**

ప్రచురణ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | గురువారం, 17 సెప్టెంబరు 2026 | ఎడిటర్ : మన్నే లక్ష్మణ్ | సంపుటి : 1 సంచిక : 325 | పేజీలు : 8 | వెల : 5/-

## తెలంగాణలో సెమీకండక్టర్..

# పెట్టుబడుల ఆసక్తి

ముఖ్యమంత్రితో సింగపూర్ ప్రతినిధుల భేటీ



### పారిశ్రామిక పెట్టుబడులపై విస్తృత చర్చలు

### ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం

### సెమీకండక్టర్ పరిశ్రమపై సానుకూల సంకేతాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి) :** తెలంగాణలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు చేసే అవకాశాలపై సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖకు చెందిన ఇంధన–వాణిజ్య విభాగం ఆసక్తి వ్యక్తం చేసింది. సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ పర్మనెంట్ సెక్రటరీ ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమై పారిశ్రామిక పెట్టుబడులు, ఆర్థిక భాగస్వామ్య అవకాశాలపై చర్చలు జరిపింది. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాలపై ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు. సమావేశంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక పరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, విధాన పరమైన ప్రోత్సాహకాలను వేగంగా అందిస్తామని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశ్రమలను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ సందర్భంగా డిసెంబర్‌లో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆగస్టిన్ లీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పరిశ్రమల ప్రతినిధులు, ఆర్థిక సంస్థలకు తెలంగాణను ప్రముఖ పెట్టుబడి గమ్యస్థానంగా పరిచయం చేయడమే ఈ సదస్సు లక్ష్యమని పేర్కొన్నారు. సింగపూర్ సంస్థలు ఈ వేదికను వినియోగించుకుని రాష్ట్రంలోని అవకాశాలను పరిశీలించాలని కోరారు. మూసీ పునరుజ్జీవన ప్రణాళికలు,

(మిగతా.. 2లో)



## ధరణిపై సీఎం

# తీవ్ర విమర్శలు

- భూ దోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్న రేవంత్
- భూముల డేటా మాఫియా చేతికి వెళ్లిందని ఆరోపణ
- ధరణి ద్వారా ఇష్టారాజ్యంగా భూ బదిలీలు జరిగాయన్న వ్యాఖ్య
- అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై సీఎం విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి)** ధరణి పోర్టల్‌పై శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని ఆరోపించిన ఆయన, భూ దోపిడీకి సంబంధించిన ఆలోచనల నుంచే ధరణి అనే వ్యవస్థ పుట్టిందని అన్నారు. ప్రస్తుతం అది తెలంగాణ సమాజాన్ని పీడిస్తున్న భూతంగా మారిందని వ్యాఖ్యానించారు. ధరణి వ్యవస్థను తానే రూపొందించానని కేసీఆర్ గతంలో చెప్పుకున్నారని, అయితే అది పూర్తిగా అసత్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీకి కాకుండా ప్రైవేటు సంస్థలకు ఎందుకు అప్పగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ధరణి అమలులో పలు అనుమానాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు

(మిగతా.. 2లో)



## సస్పెన్షన్‌పై..

# హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్

### అసెంబ్లీలో ప్రశ్నలను ఎదుర్కోలేకే చర్యలని ఆరోపణ

### ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి)** అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ అంశంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేకనే తమను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయకుండా అడ్డుకోవడానికే ఈ చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. సస్పెన్షన్ ఎత్తివేస్తే ప్రభుత్వ వైఖరిని ఆధారాలతో సహా సభలో బయటపెడతామని ఇప్పటికే చెప్పామని హరీశ్‌రావు గుర్తు చేశారు. అయినప్పటికీ తమపై విధించిన సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేయకపోవడం

(మిగతా.. 2లో)

## వరదల నివారణకు

# చెరువులే రక్షణ : రంగనాథ్

### పట్టణీకరణతో నగరాలకు పెరుగుతున్న వరద ముప్పు

### చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

### యువ ఆపద మిత్రులు సేవాభావంతో ముందుకు రావాలి

### అక్రమ నిర్మాణాలు కూడా వైపరీత్యాలకు కారణమని హెచ్చరిక

### హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

2లో..




## ప్రత్యేక స్వచ్ఛత ప్రచారానికి కొత్త ఊపు

- స్వచ్ఛత ప్రచారం 6.0 వెబ్ పోర్టల్ ప్రారంభం
- శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణపై దృష్టి
- ఈ-వ్యర్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు
- రూ.5,000 కోట్ల ఆదాయం సాధించిన ప్రచారం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి) :** కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ప్రత్యేక స్వచ్ఛత ప్రచారం 6.0 కోసం వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. స్వచ్ఛత అనేది కేవలం ఒక శాఖ లేదా ఒక కార్యక్రమానికి పరిమితం కాదని, ఇది ప్రభుత్వ వ్యవస్థ మొత్తంతో పాటు దేశ ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్న జాతీయ ఉద్యమంగా మారిందని ఆయన పేర్కొన్నారు. 2021లో ప్రారంభమైన స్వచ్ఛత ప్రచారం కాలక్రమేణా సాధారణ పరిశుభ్రత కార్యక్రమం నుంచి దేశవ్యాప్త ఉద్యమంగా రూపాంతరం చెందిందని మంత్రి వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోయిన అనవసర వస్తువులు, పాత సామగ్రి, వినియోగం లేని సామాన్లను తొలగించడం ద్వారా కార్యాలయాల సామర్థ్యాన్ని పెంచడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రచారం ప్రారంభమైనప్పటి నుంచి స్క్రాప్ విక్రయం ద్వారా సుమారు రూ.5,000 కోట్ల ఆదాయం సమకూరినట్లు మంత్రి వెల్లడించారు. పాత సామగ్రిని శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించడం, పునర్వినియోగం చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభించడమే కాకుండా

(మిగతా.. 2లో)




## యూపీఐపై కేంద్రం స్పష్టీకరణ విడుదల

- విదేశీ ప్రభావం వాదనల ఖండన
- యూపీఐ స్వతంత్ర అభివృద్ధి ప్రస్థానం
- వ్యాపార లావాదేవీలపై స్వల్ప రుసుము
- వినియోగదారులకు సేవలు యథాతథ ఉచితం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి)** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ వ్యవస్థలో మర్చంట్ డిస్కౌంట్ రేట్ మార్పుల వెనుక విదేశీ శక్తుల ప్రభావం ఉందంటూ వస్తున్న ప్రచారాన్ని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. యూపీఐకు సంబంధించిన విధాన నిర్ణయాలన్నీ దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పూర్తిగా స్వతంత్రంగా తీసుకుంటున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక ద్వారా విడుదల చేసిన ప్రకటనలో కేంద్రం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించింది. విదేశీ ఒత్తిళ్లు లేదా బాహ్య ప్రభావాల

(మిగతా.. 3లో)

## అమెరికా బిల్లుతో భారత్‌కు సవాళ్లు

- రష్యా చమురు దిగుమతులపై దృష్టి
- 100 శాతం సుంకాల ప్రతిపాదన
- ప్రతినిధుల సభలో కీలక ముందడుగు



**వాషింగ్టన్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి)** రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై కఠిన చర్యలకు అమెరికా సిద్ధమవుతోంది. రష్యా నుంచి భారీ స్థాయిలో చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న దేశాలపై దిగుమతి సుంకాలు విధించే అవకాశాన్ని కల్పించే కీలక బిల్లు అమెరికా ప్రతినిధుల సభలో ముందడుగు వేసింది. "లిండ్సే గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026" పేరుతో రూపొందించిన ఈ బిల్లుకు సంబంధించిన తీర్మానం స్వల్ప మెజారిటీతో ఆమోదం పొందడంతో తుది ఓటింగ్‌కు మార్గం సుగమమైంది. ప్రతినిధుల సభలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు

(మిగతా.. 2లో)

# మెటాపై కేంద్రం కఠిన వైఖరి

- సాధారణ మధ్యవర్తి కాదన్న కేంద్రం
- కంటెంట్‌పై మరింత బాధ్యత అవసరం
- చిన్నారుల భద్రతకు కొత్త చర్యలు
- చట్టపరమైన రక్షణపై చర్చ వేగం

**న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి)** ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటాపై కేంద్ర ప్రభుత్వం కీలక వ్యాఖ్యలు చేసింది. వినియోగదారులకు ఏ సమాచారం ఎక్కువగా కనిపించాలి, ఏ కంటెంట్ విస్తృతంగా చేరాలి అనే అంశాలను అల్గారిథమ్‌ల ద్వారా ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో మెటాను కేవలం సాధారణ మధ్యవర్తి సంస్థగా పరిగణించలేమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. కేవలం సమాచారాన్ని చేరవేసే వేదికగా కాకుండా సేవలందించే సంస్థగా వ్యవహరిస్తున్నందున దానికి మరింత బాధ్యత ఉంటుందని స్పష్టం చేశాయి. సామాజిక మాధ్యమ వేదికల ద్వారా కోట్లాది మంది ప్రజలకు సమాచారం చేరుతున్న నేపథ్యంలో సంస్థలు తమ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని కేంద్రం అభిప్రాయపడుతోంది. కంటెంట్ వ్యాప్తిలో ప్రత్యక్ష పాత్ర పోషిస్తున్న సంస్థలు ప్రజలపై చూపే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని చట్టపరమైన ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో మెటా భవిష్యత్తులో మరింత జవాబుదారీతనంతో వ్యవహరించాల్సి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సామాజిక మాధ్యమ సంస్థలకు లభించే చట్టపరమైన రక్షణ అంశం కూడా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మెటా తన వేదికలోని కంటెంట్ వ్యాప్తిని నియంత్రిస్తున్న పరిస్థితుల్లో సాధారణంగా లభించే రక్షణ వర్తింపుపై సందేహాలు ఉన్నాయని కేంద్ర వర్గాలు పేర్కొన్నాయి. అయితే దీనిపై తుది నిర్ణయం న్యాయస్థానాల పరిధిలోనే ఉంటుందని, కోర్టులు తీసుకునే నిర్ణయమే అమలులోకి వస్తుందని స్పష్టం చేశాయి. ఇటీవల చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాల్లో మెటా తన వేదికలో ఉన్న లోపాలను గుర్తించి చర్యలు చేపట్టేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన అభ్యంతరకర కంటెంట్‌ను గుర్తించడం, నివేదించడం వంటి అంశాల్లో మరింత కఠిన విధానాలు అమలు చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. దీనివల్ల ఆన్‌లైన్ వేదికల భద్రతను బలోపేతం చేయడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇకపై చిన్నారుల భద్రతకు సంబంధించిన అనుమానాస్పద అంశాలను నేరుగా భారత సైబర్ నేరాల పోర్టల్‌కు తెలియజేయడానికి మెటా అంగీకరించినట్లు కేంద్ర వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకు విదేశీ సంస్థలకు నివేదికలు పంపుతున్న విధానానికి బదులుగా భారత చట్ట అమలు సంస్థలకు నేరుగా సమాచారం అందించనుంది.

(మిగతా.. 2లో)





# ప్రత్యేక స్వచ్ఛత ప్రచారానికి కొత్త ఊపు

(మొదటి పేజీ తరువాయి..)

కార్యాలయాల్లో స్థల వినియోగం మెరుగుపడిందని తెలిపారు. ప్రత్యేక స్వచ్ఛత ప్రచారం 6లో శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. ముఖ్యంగా ఈ-వ్యర్థాల సేకరణ, సురక్షిత నిర్మూలన, పర్యావరణ పరిరక్షణకు అనుగుణమైన చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లు, పరిష్కారం కాని అంశాలను తగ్గించడంపై కూడా ఈ ప్రచారం దృష్టి సారించనుంది. పరిపాలనా వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. దేశవ్యాప్తంగా పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సమర్థ పరిపాలన లక్ష్యాలతో కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖలు, ఉద్యోగులు, ప్రజలు చురుకుగా పాల్గొనాలని జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతను ప్రజల జీవనశైలిలో భాగంగా మార్చడం ద్వారా స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనకు మరింత బలమైన పునాది ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# తెలంగాణలో సెమీకండక్టర్ పెట్టుబడుల ఆసక్తి



(మొదటి పేజీ తరువాయి..)

భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యక్రమాలను కూడా ముఖ్యమంత్రి ప్రతినిధి బృందానికి వివరించారు. తొలి దశలో మూసీ, ఈసా నదుల సంగమ ప్రాంతం నుంచి గాంధీ సరోవర్ వరకు పునరుజ్జీవన పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు రాత్రి ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించే ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌ను పర్యాటక కేంద్రంగా మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీని పర్యావరణహిత నెట్-జీరో నగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి అంతర్జాతీయ విద్యాసంస్థలు తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన విషయాన్ని ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. విద్య, పరిశోధన, సాంకేతిక రంగాల్లో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై సానుకూలంగా స్పందించిన సింగపూర్ ప్రతినిధి బృందం సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు చేసే అంశాన్ని అనుకూలంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, సింగపూర్ కాన్సుల్ జనరల్ విలియం చిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ చర్చలు తెలంగాణలో అధునాతన సాంకేతిక పరిశ్రమల పెట్టుబడులకు కొత్త అవకాశాలు తెరచే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

# అమెరికా బిల్లుతో భారత్‌కు సవాళ్లు



(మొదటి పేజీ తరువాయి..)

అనుకూలంగా 214 ఓట్లు, వ్యతిరేకంగా 211 ఓట్లు నమోదయ్యాయి. ఇద్దరు డెమొక్రాట్ సభ్యులు రిపబ్లికన్లకు మద్దతుగా ఓటు వేయడం బిల్లుకు కీలకంగా మారింది. దీంతో బుధవారం జరగనున్న తుది ఓటింగ్‌పై అంతర్జాతీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే అమెరికా సెనేట్ ఈ బిల్లును 86-11 ఓట్ల భారీ ఆధిక్యంతో ఆమోదించింది. ప్రతినిధుల సభలో కూడా బిల్లు ఆమోదం పొందితే అది చట్టంగా మారనుంది. ఈ చట్టం ప్రకారం రష్యా నుంచి అత్యధికంగా చమురు లేదా సహజవాయువు కొనుగోలు చేస్తున్న ఐదు దేశాల నుంచి అమెరికాకు వచ్చే వస్తువులపై 100 శాతం వరకు దిగుమతి సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి లభిస్తుంది. దీంతో అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలపై కొత్త ఒత్తిడులు ఏర్పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. బిల్లులో భారత్ పేరును ప్రత్యక్షంగా ప్రస్తావించనప్పటికీ, ప్రస్తుతం రష్యా చమురు కొనుగోలుదారుల్లో భారత్ ప్రముఖ స్థానంలో ఉంది. చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా భారత్ టాప్-5 దేశాల జాబితాలో కొనసాగితే ఈ నిబంధనల ప్రభావం పడే అవకాశం ఉందని అంతర్జాతీయ వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. భారత్‌తో పాటు చైనా, అజర్‌బైజాన్, హంగేరి, స్లోవేకియా వంటి దేశాలు కూడా ఈ పరిధిలోకి వచ్చే అవకాశముంది. అయితే ఈ బిల్లులో మరో ముఖ్య అంశం కూడా ఉంది. ప్రత్యేక పరిస్థితుల్లో కొన్ని దేశాలకు మినహాయింపులు ఇచ్చే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పించారు. దీంతో వ్యూహాత్మక భాగస్వామ్య దేశాల విషయంలో అమెరికా ప్రభుత్వం పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల బిల్లు చట్టంగా మారిన వెంటనే అన్ని దేశాలపై ఒకే విధంగా చర్యలు అమలవుతాయనే పరిస్థితి ఉండకపోవచ్చని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఉక్రెయిన్ యుద్ధానికి నిధులు సమకూర్చుకుంటున్న రష్యా ఇంధన ఆదాయాన్ని తగ్గించడమే ఈ బిల్లుకు ప్రధాన ఉద్దేశమని దీని మద్దతుదారులు పేర్కొంటున్నారు. అలాగే రష్యా నాయకత్వం, ఇంధన రంగం, చమురు రవాణాలో ఉపయోగిస్తున్న నౌకలపై అదనపు ఆంక్షలు విధించే ప్రతిపాదనలు కూడా ఇందులో ఉన్నాయి. ఇరాన్‌పై ఇప్పటికే అమల్లో ఉన్న ఆంక్షలను మరింత కాలం కొనసాగించే నిబంధనలు కూడా చేర్చారు. గురువారం నుంచి ప్రతినిధుల సభ సమావేశాలు విరామంలోకి వెళ్లనున్న నేపథ్యంలో ఈ బిల్లు తుది ఫలితం అంతర్జాతీయంగా కీలకంగా మారింది.

# మెటాపై కేంద్రం కఠిన వైఖరి

(మొదటి పేజీ తరువాయి..)

దీనివల్ల దర్యాప్తు ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు నేరస్తులపై త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుందని అధికారులు భావిస్తున్నారు. భారత్‌లో ఆన్‌లైన్ భద్రత, చిన్నారుల రక్షణ, తప్పుడు సమాచార నియంత్రణ, కృత్రిమ మేధస్సుతో రూపొందించే మోసపూరిత కంటెంట్ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రత్యేక దృష్టి సారించింది. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో మెటా సహా ఇతర సామాజిక మాధ్యమ సంస్థలు కూడా తమ విధానాలను పునఃసమీక్షించి భారత చట్టాలకు అనుగుణంగా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# వరదల నివారణకు చెరువులే రక్షణ : రంగనాథ్




**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి)**
పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో నగరాల్లో వరదల ముప్పు పెరుగుతోందని, ప్రాణ, ఆస్తి నష్టాల నివారణలో ప్రభుత్వ శాఖలతో పాటు యువ ఆపద మిత్రులు కూడా కీలక పాత్ర పోషించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. నాగోలులోని హైడ్రా శిక్షణ కేంద్రంలో యువ ఆపద మిత్ర ఐదో బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి శిక్షణార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని సహజ నీటి వనరులు, చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని తెలిపారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఉపగ్రహ చిత్రాల ప్రకారం నగరంలోని 69 శాతం చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని వెల్లడించారు. చెరువులను పరిరక్షిస్తే వరదల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. అందుకే చెరువుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించే విధానానికి భిన్నంగా, ముందస్తు నివారణ చర్యలే హైడ్రా ప్రధాన లక్ష్యమని కమిషనర్ వివరించారు. పర్యావరణ పరిరక్షణ ద్వారా ప్రకృతి విపత్తులకు అవకాశమే లేకుండా చూడాలని హైడ్రా కృషి చేస్తోందన్నారు. భారీ వర్షాల సమయంలో వరద నీరు నాలాల ద్వారా చెరువులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాలాలు, చెరువుల అభివృద్ధి వల్ల వరదలను నియంత్రించవచ్చని ఇప్పటికే పలు ప్రాంతాల్లో రుజువైందని రంగనాథ్ పేర్కొన్నారు. నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు నీటి పారుదల వ్యవస్థలను బలోపేతం చేయడం అత్యవసరమని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. అక్రమ నిర్మాణాలు కూడా మానవసృష్టి వైపరీత్యాలకు కారణమవుతున్నాయని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు. చిన్న స్థలాల్లో అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోందన్నారు. ఇటీవల గచ్చిబౌలి, సిద్ధిఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లో చోటుచేసుకున్న భవన ప్రమాదాలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ ఇటువంటి ఘటనలు మానవ తప్పిదాల ఫలితమని పేర్కొన్నారు. సమాజ సేవా దృక్పథంతో ముందుకు వచ్చిన యువ ఆపద మిత్రులు అభినందనీయులని రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన 117 మంది విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి సంబంధిత ప్రభుత్వ శాఖలకు సమాచారం అందిస్తూ నష్ట నివారణలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, అదనపు కమిషనర్లు ఆర్. సుదర్శన్, డి. ఆనంద్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హరీశ్‌రావుపై పొంగులేటి ప్రశ్నల వర్షం

- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై వ్యాఖ్యలు
- పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై ఆరోపణలు
- 22ఏ భూముల అంశంపై కీలక వివరాలు
- అసెంబ్లీ లాబీలో మంత్రి స్పందన

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి)**
మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి విమర్శలు గుప్పించారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని పేర్కొంటూ, అలాంటి పరిస్థితుల్లో హరీశ్‌రావు కుటుంబానికి సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి, అసైన్డ్ భూములకు అనుమతులు ఇవ్వడం చట్టబద్ధం కాదని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం అలాంటి నిర్ణయం తీసుకున్నా అది తప్పేనని స్పష్టం చేశారు. ఈ విషయం తెలిసి కూడా ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తడం సరైందేనా అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. ఈ అంశంపై కూడా ప్రభుత్వం పరిశీలన జరుపుతోందని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ విషయంలో చట్టవిరుద్ధ చర్యలు జరిగితే వాటిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు సంబంధించిన భూముల వ్యవహారాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. నిషేధిత భూములకు సంబంధించి హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ జరిగినట్లు ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఏ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని మరోసారి స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాపై కూడా మంత్రి కీలక వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం ఆ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలినవి ప్రభుత్వ భూములేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలను తొలగించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించామని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ వ్యవహారాలపై పూర్తి వివరాలను త్వరలోనే ప్రజల ముందుకు తీసుకువస్తామని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 22ఏ భూముల అంశంపై ప్రభుత్వం సమగ్ర పరిశీలన నిర్వహిస్తోందని, అవసరమైన నిర్ణయాలను త్వరలో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.



కాగా, ఇవన్నీ మంత్రి పొంగులేటి చేసిన ఆరోపణలు, వ్యాఖ్యలేనని, సంబంధిత వ్యక్తుల స్పందన వెలువడాల్సి ఉంది.

# సస్పెన్షన్‌పై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి..)

వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నలు లేవనెత్తే ప్రతిపక్ష స్వరాన్ని అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ప్రశ్నలను ఎదుర్కొనే పరిస్థితిలో లేరని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ పనితీరు, వివిధ అంశాలపై తాము లేవనెత్తబోయే విషయాలు బయటకు రాకుండా ఉండేందుకే తమను సభకు దూరం చేశారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష పాత్రను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలకు సంబంధించిన అంశాలపై తాము మాట్లాడతామని చెప్పిన తర్వాతే సస్పెన్షన్ కొనసాగించారని హరీశ్‌రావు ఆరోపించారు. తమ వద్ద ఉన్న సమాచారం బయటకు వస్తుందనే భయంతోనే ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ ప్రజాస్వామ్య చర్చలకు వేదిక కావాలని, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. విభిన్న అభిప్రాయాలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి సభా కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికార పక్షంపై ఉందని ఆయన అన్నారు.



# సీఎంఆర్‌ఎఫ్‌తో బాధితులకు ఆర్థిక భరోసా : హోంమంత్రి

- ఆపదలో ఉన్న కుటుంబాలకు అండ
- ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- బాధితులకు ఊరట కల్పిస్తున్న ప్రభుత్వం
- హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత



**అమరావతి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి)**
ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. కష్టకాలంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సహాయం బాధితులకు కొంతైనా ఊరటను అందిస్తుందని అన్నారు. ప్రజలు ఎదుర్కొనే అనుకోని విపత్తులు, ప్రమాదాలు, ఆరోగ్య సమస్యల సమయంలో ప్రభుత్వం తోడుగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి కష్టాలను కొంత మేర తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన బాధితులకు పారదర్శకంగా సహాయం అందిస్తున్నట్లు మంత్రి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందేలా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. బాధిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో మరింత కుంగిపోకుండా ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి అన్నారు. ప్రతి కుటుంబం కష్టసమయంలో ధైర్యంగా నిలబడేలా చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. సహాయ నిధి ద్వారా అందిస్తున్న మద్దతు వారికి కొత్త ఆశను కల్పిస్తుందని చెప్పారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ అవసరమైన చోట తక్షణ సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలు కేవలం పథకాలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. బాధితులకు వేగంగా సహాయం అందేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల కన్నీళ్లు తుడిచి ప్రతి కుటుంబానికి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం ద్వారా సమాజంలో నమ్మకం పెంపొందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజా సంక్షేమం, సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

# ధరణిపై సీఎం తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి..)

ఇష్టానుసారంగా భూముల బదిలీలు చేసుకున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. 2021 నాటికి 21 లక్షల 93 వేల 50 ఎకరాలను పార్ట్-బి కింద నిషేధిత జాబితాలో చేర్చారని, ఈ ప్రక్రియలో అనేక సమస్యలు తలెత్తాయని అన్నారు. ధరణి వల్ల భూముల యాజమాన్య వివాదాలు పెరిగాయని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన సుమారు 2.5 కోట్ల ఎకరాల భూముల సమాచారాన్ని మాఫియా చేతుల్లోకి వెళ్లేలా చేశారని సీఎం ఆరోపించారు. ప్రజల ఆస్తులకు సంబంధించిన కీలక డేటా భద్రతపై ప్రశ్నలు తలెత్తాయని అన్నారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ అవసరమని అభిప్రాయపడ్డారు. 1982లో అమలులోకి వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటైన తర్వాత రద్దు చేశారని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి, ఆ నిర్ణయం వెనుక కారణాలను కేసీఆర్ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ధరణి కాంట్రాక్టు విలువ, అమలు విధానంపై కూడా పలు ప్రశ్నలు లేవనెత్తారు. అసెంబ్లీలో ఈ అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ సభ్యులు సభలో లేకపోవడాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తాము లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే సభకు దూరంగా ఉన్నారని ఆరోపించారు. ధరణి వ్యవస్థకు సంబంధించిన అన్ని అంశాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# పార్ట్‌టైమ్ టీచర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**• ఈ నెల 18లోగా దరఖాస్తులు సమర్పించాలి • 19న డెమో, ఇంటర్వ్యూలు : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి)**
సంగారెడ్డి జిల్లా పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు/కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన పార్ట్‌టైమ్ టీచర్లను నియమించేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4:00 గంటలలోగా చిట్కుల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ ఉదయం 10:00 గంటలకు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజు తాజా ఫొటోలతో చిట్కుల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించే డెమో మరియు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

**మరిన్ని వివరాల కోసం జిల్లా సమన్వయ అధికారి, TGSWREIS, చిట్కుల్ ను 9704550253, 9640382248 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.**

# గణనాథుని సన్నిధిలో భక్తి స్వరాలు

## సంగారెడ్డి నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో భజనలు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి) :** సంగారెడ్డి నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక భజన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రెండో రోజు ఉత్సవాల్లో భాగంగా వినాయకుని సన్నిధిలో నిర్వహించిన భజన కార్యక్రమంతో పట్టణంలోని మంజీరా నగర్ మెయిన్ రోడు భక్తిమయంగా మారింది. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథునికి నైవేద్యం సమర్పించిన కమిటీ సభ్యులు అనంతరం భవాని భజన మండలి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో స్వామివారిని కొలిచారు. గణపతి నామస్మరణతో మార్మోగగా, భక్తులు ఆధ్యాత్మిక భావనలో మునిగిపోయారు. చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా భజన కార్యక్రమంలో పాల్గొని గణనాథుని కృపకు పాత్రులయ్యారు. భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ భజన కళాకారులు శాంతి కుమార్, శ్రీశైలం, నర్సింలు, మహేష్, కమిటీ సభ్యులు మాణిక్ ప్రభు, దత్తాత్రి, సాయినాథ్, శ్రీశైలం, పెంటయ్య, సురేష్, ఆంజనేయులు, రాము, శేఖర్, రమేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల ఆదేశాలు బేఖాతర్

## బొమ్మరెడ్డిగూడెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

**బొమ్మరెడ్డిగూడెం, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి):** బొమ్మరెడ్డిగూడెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ అధికారుల సూచనలకు విరుద్ధంగా జరిగిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గ్రామంలో సభ ఏర్పాటు చేసి అధికారుల సమన్వయంతో కార్డులు పంపిణీ చేయాలని ఎంఆర్ఓ, జీపీఓ సూచించినప్పటికీ సర్పంచ్ ఏకపక్షంగా పంపిణీ చేపట్టారని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులను సంబంధిత రేషన్ డీలర్‌కు కాకుండా సర్పంచ్‌కు అప్పగించడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నిర్వహించాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ కాంగ్రెస్ నాయకులు కోరారు.

# పెద్దకంజర్లలో విషాదం..

## వినాయక నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థుల మృతి







**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి) :**
పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. వినాయక నిమజ్జనం కోసం నేరేడుచెరువులోకి దిగిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందారు. మృతులంతా శిరీష చారిటబుల్ ట్రస్ట్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులుగా గుర్తించారు. మృతులను నర్సింహ రాజు, సుమంత్ (డిప్లొమా రెండో సంవత్సరం), గణేష్ (డిప్లొమా రెండో సంవత్సరం), ఉదయ్ కిరణ్ (డిప్లొమా మూడో సంవత్సరం), శ్యామ్ కుమార్ (డిప్లొమా మొదటి సంవత్సరం), సిద్ధార్థ్ (10వ తరగతి)గా గుర్తించారు.

### శిరీష చారిటబుల్ ట్రస్ట్‌లో విద్యాభ్యాసం

శివనగర్ చౌరస్తా, పెద్దకంజర్లలో శిరీష చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. తల్లిదండ్రులు లేని విద్యార్థులను మాత్రమే ట్రస్ట్‌లో చేర్చుకుని, ఒకటో తరగతి నుంచి పాలిటెక్నిక్, బీటెక్ వరకు విద్యను అందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సుమారు 70 మంది విద్యార్థులు ట్రస్ట్‌లో ఉన్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కృష్ణంరాజు అనే వ్యక్తి తన కుమార్తె శిరీష పేరుతో ఈ ట్రస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

### ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పరామర్శ


విద్యార్థుల మృతి పట్ల పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన విషయం తెలుసుకున్న ఆయన ప్రాచీన గ్లోబల్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల మృతదేహాలకు నివాళులర్పించారు. గురువారం ఉదయం 10 గంటలలోపు పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మృతదేహాలను వారి స్వస్థలాలకు అంబులెన్సుల ద్వారా తరలించాలని సూచించారు. ఇందుకోసం తన సొంత నిధులతో అంబులెన్సులను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఒకేసారి ఆరుగురు విద్యార్థులు మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనతో పెద్దకంజర్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కూల్చివేతలు లేకుండానే బైపాస్ రోడ్డు అభివృద్ధి

## 80 అడుగుల రోడ్డు కోసం 180 భవనాలు తొలగించడం అవసరమా?: జగ్గారెడ్డి



**సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి):**
సంగారెడ్డి బైపాస్ రోడ్డు అభివృద్ధిని భవనాల కూల్చివేతలు లేకుండా చేపట్టాలన్నదే తన ఉద్దేశమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి బసవేశ్వర విగ్రహం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు కాలినడకన పర్యటించారు. ప్రస్తుతం ఉన్న రహదారి విస్తీర్ణాన్ని అధికారులతో కొలతలు తీయించి అభివృద్ధి పనులపై చర్చించారు. బైపాస్ రోడ్డు అభివృద్ధికి తాను రూ.18 కోట్ల నిధులు మంజూరు చేయించానని జగ్గారెడ్డి తెలిపారు. 80 అడుగుల రోడ్డు నిర్మాణం కోసం సుమారు 180 భవనాలు తొలగించాల్సి వస్తుందని, బాధితులకు కోట్ల రూపాయల్లో నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇంత భారీ కూల్చివేతలు అవసరమా అని ప్రశ్నించారు. కూల్చివేతలు లేకుండా 50 అడుగుల మేర రహదారిని అభివృద్ధి చేస్తే భవన యజమానులు, ఫుట్‌పాత్ వ్యాపారులకు నష్టం జరగకుండా వాహనదారులకు సౌకర్యం కల్పించవచ్చన్నారు. స్థానిక ఎమ్మెల్యే అధికారులకు ఫిర్యాదులు చేయడంతో పనులకు ఆటంకం ఏర్పడుతోందని జగ్గారెడ్డి ఆరోపించారు. 80 అడుగుల రోడ్డు అవసరమని భావిస్తే ఎమ్మెల్యే ప్రజల మధ్యకు వచ్చి కూల్చివేతలపై తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులకు నష్టం కలగకుండా అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో బైపాస్ రోడ్డు అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు.




# యూపీఐపై కేంద్రం స్పష్టీకరణ విడుదల

(మొదటి పేజీ తరువాయి..)

ఆధారంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని తేల్చిచెప్పింది. 2016లో ప్రారంభమైన యూపీఐ వ్యవస్థ భారతీయ అవసరాలు, నిబంధనలు, సాంకేతిక సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చెందిందని కేంద్రం గుర్తుచేసింది. తక్కువ కాలంలోనే ఇది ప్రపంచంలోనే అతిపెద్ద తక్షణ చెల్లింపుల వ్యవస్థగా ఎదిగిందని పేర్కొంది. కోట్లాది మంది ప్రజలు రోజువారీ చెల్లింపుల కోసం దీనిపై ఆధారపడుతున్నారని తెలిపింది. 2026 ఆగస్టు నెలలో మాత్రమే 24.5 బిలియన్ల లావాదేవీలు నమోదు కావడం యూపీఐ విస్తరణకు నిదర్శనమని వివరించింది. చెల్లింపుల వ్యవస్థను మరింత బలపరచడం, భద్రతను పెంచడం, సాంకేతికంగా అభివృద్ధి చేయడం కోసం అధిక విలువ గల కొన్ని వ్యాపార లావాదేవీలపై స్వల్ప రుసుము విధిస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ రుసుముల ద్వారా సమకూరే నిధులను మౌలిక వసతుల విస్తరణ, సైబర్ భద్రతా చర్యలు, గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలకు వినియోగిస్తామని పేర్కొంది. చిన్న వ్యాపారులకు సాంకేతిక మద్దతు అందించడంలో కూడా ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపింది. యూపీఐ వినియోగదారులకు ఎలాంటి అదనపు భారం ఉండదని కేంద్రం పునరుద్ఘాటించింది. స్నేహితులకు డబ్బు పంపడం, దుకాణాల్లో చెల్లింపులు చేయడం, క్యూఆర్ సంకేతాలను స్కాన్ చేసి లావాదేవీలు నిర్వహించడం వంటి వ్యక్తిగత వినియోగ సేవలన్నీ గతంలాగే ఉచితంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. నెలకు లక్ష రూపాయల వరకు యూపీఐ ద్వారా ఆదాయం పొందే చిన్న వ్యాపారులకు కూడా మినహాయింపు కొనసాగుతుందని తెలిపింది. దేశంలో జరిగే అధిక భాగం చెల్లింపులు చిన్న మొత్తాలవేనని, వాటిపై ఎలాంటి రుసుము ఉండదని వివరించింది. రెండు వేల రూపాయలు దాటిన పెద్ద వ్యాపార లావాదేవీలపై మాత్రమే 0.4 శాతం మేర స్వల్ప రుసుము వర్తిస్తుందని కేంద్రం తెలిపింది. ఈ రుసుము కూడా వినియోగదారులు కాకుండా వ్యాపారులు మాత్రమే భరించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇతర చెల్లింపు వ్యవస్థలతో పోలిస్తే ఇది చాలా తక్కువ స్థాయిలోనే ఉందని వివరించింది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ దీర్ఘకాలిక స్థిరత్వం కోసం ఈ చర్యలు అవసరమని అభిప్రాయపడింది. రైల్వే, ఇంధనం, టెలికాం, బీమా, బిల్లు చెల్లింపులు వంటి కొన్ని రంగాల్లో రెండు వేల రూపాయలు దాటిన లావాదేవీలకు ఐదు రూపాయల స్థిర రుసుము ఉంటుందని కేంద్రం వెల్లడించింది. మ్యూచువల్ ఫండ్, సెక్యూరిటీస్ చెల్లింపులపై 0.02 శాతం రుసుము మాత్రమే ఉంటుందని, గరిష్ఠంగా మూడు వందల రూపాయల పరిమితి వర్తిస్తుందని తెలిపింది. వ్యాపారులు ఈ రుసుములను వినియోగదారులపై మోపడానికి అనుమతి లేదని స్పష్టం చేసింది. అలాగే యూపీఐ సేవలు అందించే అనువర్తనాలు అదనపు వేదిక రుసుములు విధించరాదని కఠిన నిబంధనలు అమల్లో ఉన్నాయని కేంద్రం పేర్కొంది.

# వినాయక నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన చైర్‌పర్సన్ - డీఎస్పీ



జగిత్యాల జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 16 (నవజ్యోతి): వినాయక నిమజ్జనం సందర్భంగా జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు - టవర్ ప్రాంతాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ - డీఎస్పీ పురుషోత్తంరావు బుధవారం పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన ప్రదేశాలు - భక్తులు తరలివచ్చే మార్గాలను పరిశీలించి పోలీసు - మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులు - గణేష్ ఉత్సవ నిర్వాహకులు అధికారులకు సహకరించి సూచనలు పాటించాలని కోరారు. పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, టౌన్ సీఐ కరుణాకర్, మున్సిపల్ అధికారులు - పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు భాషా ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి

# పద్య పఠన పోటీలు




జగిత్యాల జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 16 (నవజ్యోతి): జగిత్యాల డీసీఈబీ భవనంలో తెలుగు భాషా ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పద్య పఠన పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలైన ప్రభుత్వ - జిల్లా పరిషత్ - మోడల్ - సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో ద్వితీయ భాషగా తెలుగు చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి కే. రాము - విశిష్ట అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్ - ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ మురళీ మనోహరాచారి, డాక్టర్ ఎల్లాల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వేణుబాబు పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1,000 - ద్వితీయ బహుమతిగా రూ.500 చొప్పున నగదు బహుమతులు అందించారు. విద్యార్థులు - ఉపాధ్యాయులకు డాక్టర్ ఎల్లాల శ్రీనివాసరెడ్డి భోజన వసతి కల్పించారు. తెలుగు భాషా ఫోరం అధ్యక్షుడు బి. శేషగిరి, ప్రధాన కార్యదర్శి ముత్యంపేట గంగాధర్ - తెలుగు ఉపాధ్యాయులు - విద్యార్థులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన వృద్ధుడు శవమై లభ్యం

గజ్వేల్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): రాయపోల్‌కు చెందిన పంబాల చిన్నబాలరాజు (75) మృతదేహం గజ్వేల్ పట్టణ శివారులోని జాలిగామ రోడ్డులో రైల్వేట్రాక్ సమీపంలో లభ్యమైంది. అనారోగ్యం - మతి స్థిమితం సరిగ్గా లేకపోవడంతో గజ్వేల్ వినాయక్‌నగర్‌లోని చిన్న కుమారుడు బాబు ఇంట్లో ఉంటున్న చిన్నబాలరాజు ఈ నెల 8న ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు 9న పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రైల్వేట్రాక్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహం చిన్నబాలరాజుదేనని ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

## గజ్వేల్‌లో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

**17న వేడుకలు.. ప్రజలు – యువత అధిక సంఖ్యలో పాల్గొనాలి**



గజ్వేల్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న గజ్వేల్‌లో తెలంగాణ విమోచన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 5:30 గంటలకు పట్టణంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో బహిరంగ సభ జరుగుతుందని పేర్కొన్నారు. "విమోచన త్యాగాల వెలుగులో వికసిత తెలంగాణ లక్ష్యం" నినాదంతో నిర్వహించే కార్యక్రమంలో పోరాట వీరుల త్యాగాలను స్మరించుకోనున్నట్లు తెలిపారు. ముఖ్య వక్తగా భాస్కర యోగిజీ హాజరై తెలంగాణ విమోచన పోరాట చరిత్ర – వీరుల త్యాగాలు – జాతీయ సమగ్రతపై ప్రసంగిస్తారని వెల్లడించారు. గజ్వేల్ పట్టణం – పరిసర మండలాల ప్రజలు, యువత, మేధావులు – దేశభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా వినాయక పూజ

**ప్రత్యేక పూజలు నిర్వహించిన చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్**



కామారెడ్డి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో వినాయక నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో – సంతోషంగా జరుపుకోవాలని, విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు – సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కాసార్ల గోదావరి, కమిషనర్ పర్వతాలు, కాంగ్రెస్ – బీఆర్ఎస్ – బీజేపీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు – సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపాలిటీకి నూతన పారిశుధ్య ఆటోలు

**నాలుగు వాహనాలను ప్రారంభించి పంపిణీ చేసిన చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్**



కామారెడ్డి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మున్సిపల్ కార్యాలయానికి నూతనంగా వచ్చిన నాలుగు పారిశుధ్య ఆటోలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ప్రారంభించి పంపిణీ చేశారు. పారిశుధ్య నిర్వహణ – ఇతర మున్సిపల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. సిబ్బంది వాహనాలను సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. 1–2 వార్డులకు ఒక ఆటో, 13–45 వార్డులకు ఒకటి, 38–39 వార్డులకు ఒకటి, 26–27–28 వార్డులకు ఒక ఆటో కేటాయించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కాసార్ల గోదావరి, కమిషనర్ పర్వతాలు, కాంగ్రెస్ – బీఆర్ఎస్ – బీజేపీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు – మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇరిగేషన్ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగి ఆందోళన

**ఫైల్ సిద్ధం చేసేందుకు డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపణ**



కామారెడ్డి, 16 (నవజ్యోతి ప్రతినిధి): జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగి జ్యోతి కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగారు. రిటైర్మెంట్ ప్రయోజనాల ఫైల్ సిద్ధం చేసేందుకు సూపరింటెండెంట్ భీమరాజు – జూనియర్ అసిస్టెంట్‌కు రూ.5 వేల చొప్పున ఇచ్చినా పని చేయలేదని ఆమె ఆరోపించారు.కొన్ని నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫైల్‌పై చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సూపరింటెండెంట్ భీమరాజుతో వాగ్వాదానికి దిగారు. జూనియర్ అసిస్టెంట్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో నిలదీశారు. పెన్షన్ రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యోగులు జోక్యం చేసుకుని నచ్చజెప్పడంతో, రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో జ్యోతి ఆందోళన విరమించారు.అధికారి వివరణ: జ్యోతి ఫైల్ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయలేదని సూపరింటెండెంట్ భీమరాజు తెలిపారు. సంతకం చేయాల్సిన సంబంధిత ఉద్యోగి సెలవులో ఉండడంతో కొంత ఆలస్యం జరిగిందని చెప్పారు.

## కుత్బుల్లాపూర్ జోనల్ వాలీబాల్‌లో సీఎంఆర్ సత్తా!

**అండర్–17 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కుత్బుల్లాపూర్ జోన్ అండర్–17 బాలుర వాలీబాల్ పోటీల్లో సూరారం సీఎంఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. బాచుపల్లిలోని సూర్య ది గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో జట్టు సమష్టి ప్రదర్శనతో రన్నరప్‌గా నిలిచింది. విజేతలను డైరెక్టర్ డా. పి. స్నితిజారెడ్డి, ప్రిన్సిపాల్ ఎల్. నాగజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రవణ్, ఉపాధ్యాయులు అభినందించారు. క్రీడా విభాగం ఉపాధ్యాయులు – వాలీబాల్ కోచ్ వెంకట్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు.

# పర్మిషన్ లేకుండానే ఎస్+3..?

# అధికారుల నజర్ ఎక్కడ?





**ఉక్కుపాదం ప్రకటనలు.. క్షేత్రంలో జీరో పర్మిషన్!**

**హైటెన్షన్ వైర్ల సమీపంలో భవనం..భద్రత ఏదీ?**

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 16: (నవజ్యోతి ప్రతినిధి) : దుండిగల్ సర్కిల్ పరిధిలోని చర్చ్ గాగిల్లాపూర్‌లో నిర్మాణ నిబంధనలకు బహిరంగ సవాల్ ఎదురవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నంబర్ 197లోని మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌లో అనుమతులు లేకుండానే ఎస్+3తో పాటు పెంట్‌హౌస్ నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.మరోవైపు నిర్మాణానికి సమీపంలోనే హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉండటం భద్రతా అంశాన్ని మరింత కీలకంగా మారుస్తోంది. ఇలాంటి ప్రాంతంలో నిర్మాణానికి సంబంధించి అనుమతులు, భద్రతా నిబంధనలు పాటించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం 'జీరో' అనుమతులతో నిర్మాణాలు సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపించడం చర్చనీయాంశంగా మారింది. నిర్మాణం బహిరంగంగా కొనసాగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారుల దృష్టికి ఇది ఎందుకు రాలేదన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటించారా? హైటెన్షన్ లైన్ సమీపంలో భద్రతా ప్రమాణాలేమిటి? అన్న అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## బిక్కనూర్ శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

**శ్రావణమాసం సందర్భంగా రూ.3,57,298 ఆదాయం**



బిక్కనూర్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): శ్రావణమాసం సందర్భంగా బిక్కనూర్ శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ హుండీని అధికారుల సమక్షంలో లెక్కించారు. హుండీ ద్వారా మొత్తం రూ.3,57,298 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారి శ్రీధర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ లింబాద్రి, వైస్ చైర్మన్ దయాకర్ రెడ్డి, సభ్యులు చికోటి ప్రభాకర్, నాగార్తి రమేష్ రెడ్డి, కార్తీక్, భాగయ్య, నారాయణ , బాగారెడ్డి , ఈశ్వర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి , కిష్టయ్య, పూజారులు రామగిరి శర్మ, రాజేశ్వర శర్మ – ఆలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌పై పుస్తక రచనకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలి



పరిగి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా 'కల్పిత నాయకుడు అంబేద్కర్' పేరుతో పుస్తకం రాస్తున్న అమరప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి – పీఆర్‌టీయూ పరిగి మండల శాఖ అధ్యక్షుడు మంచనపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అంబేద్కర్ జీవిత చరిత్ర – రచనలు – ప్రసంగాలు – రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రకు సంబంధించిన చారిత్రక ఆధారాలు ఉన్నాయని తెలిపారు. సెప్టెంబర్ 18న పుస్తక ఆవిష్కరణను చట్టపరంగా అడ్డుకోవాలని – ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతి ఇస్తే దళిత, బడుగు బలహీన వర్గాలు, ఎస్సీ – ఎస్టీ – బీసీ – మైనారిటీ – విద్యార్థి సంఘాలతో కలిసి నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

## ప్లెక్సీల వివాదానికి పరిష్కారం

**మాలో ఎలాంటి విభేదాలు లేవు.. మండల అభివృద్ధే లక్ష్యం**



చేగుంట, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి ముకుంద్): వినాయక చవితి సందర్భంగా చేగుంట పట్టణంలో ఏర్పాటు చేసిన సర్పంచుల ఫోరం ప్లెక్సీల వ్యవహారం సద్దుమణిగిందని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు సంద్రుగు స్రవంతి సతీష్ తెలిపారు. మండలంలోని 15 మంది సర్పంచులు ఫోరానికి మద్దతు తెలిపారని – ఉపాధ్యక్షురాలిగా బోనాల గ్రామ సర్పంచ్ గుర్జాకుంట సుకన్య నాగులును ఎన్నుకున్నట్లు చెప్పారు. ఫోరం సభ్యుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని – తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని పేర్కొన్నారు. సంద్రుగు స్రవంతి సతీష్ – గుర్జాకుంట సుకన్య నాగులు నేతృత్వంలో ఐదేళ్ల పాటు ఐక్యంగా పనిచేసి మండల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచులు తెలిపారు.

## మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలి

**అక్టోబర్ 6న హైదరాబాద్‌లో మహాసభ.. భైరపోగు శివకుమార్ మాదిగ**




గజ్వేల్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): అక్టోబర్ 6న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఉమ్మడి మెదక్ – నిజామాబాద్ జిల్లాల ఇన్‌చార్జి భైరపోగు శివకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల – విశ్వతేజ జూనియర్ కళాశాలలో మాదిగ విద్యార్థుల సమావేశాలు నిర్వహించారు. జిల్లా కో ఇన్‌చార్జి సామ్రాట్ ప్రకాష్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలాలను మాదిగ విద్యార్థులు అందుకుని ముందువరుసలో ఉండాలని – విద్యార్థులంతా ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. అనంతరం కళాశాల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ, మాజీ రాష్ట్ర నాయకుడు మైస రాములు మాదిగ, గజ్వేల్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఉబ్బని ఆంజనేయులు మాదిగ పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు.. డాక్టర్ టి. శ్రీను**




వేములపల్లి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): పీ.ఎం. శ్రీ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం – దుర్వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'ఎమినెంట్ ఎక్స్‌పర్ట్ టాక్'లో శాస్త్రవేత్త డాక్టర్ టి. శ్రీను 'డ్రగ్స్ అవేర్‌నెస్ అండ్ అబ్యూస్' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వల్ల ఆరోగ్యం – కుటుంబం – సమాజంపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించి, వాటికి దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దీన సుజాత, అధ్యాపక బృందం – విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషకాహారంపై తల్లులకు అవగాహన



మాడుగులపల్లి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): 9వ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఆగమోత్కూరు సెక్టార్ పరిధిలోని కుక్కడం – చింతలగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే టీహెచ్ఆర్ పదార్థాలతో వివిధ రకాల పోషకాహారం తయారు చేసుకునే విధానాన్ని తల్లులకు వివరించారు. చిన్నారులు – గర్భిణులు – బాలింతలకు పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య ఆహారం అవసరమని సూచించారు. కార్యక్రమంలో ఆడవదేవులపల్లి సూపర్‌వైజర్ నాగరాణి, కుక్కడం అంగన్‌వాడీ టీచర్ ఊర్మిళ, చింతలగూడెం అంగన్‌వాడీ టీచర్ రజిత – తల్లులు పాల్గొన్నారు.

నవజ్యోతి
తెలుగు దినపత్రిక
navajyothidaily.com

# రూ.5.11 కోట్లతో నాగారం అభివృద్ధికి శ్రీకారం

## యూజీడీ – వరదనీటి కాలువల పనులు ప్రారంభించిన వజ్రేష్ యాదవ్



నాగారం, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): నాగారం డివిజన్‌లో రూ.5.11 కోట్లకు పైగా నిధులతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ – వరదనీటి కాలువల నిర్మాణ పనులను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు – మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రారంభించారు. ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి విజయ గార్డెన్, వాయుపుత్ర హమ్రక్షన్ నగర్ వరకు యూజీడీ నిర్మాణానికి రూ.2,86,67,356 – శ్రీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నుంచి నాలా వరకు – లక్ష్మీనగర్ ప్రారంభ రోడ్డు నుంచి నాలా వరకు వరదనీటి డ్రైనేజీ పనులకు రూ.2,24,99,612 మంజూరయ్యాయి. మొత్తం రూ.5,11,66,968తో పనులు చేపట్టనున్నారు. డ్రైనేజీ – వర్షపు నీటి సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు మౌలిక వసతులు మెరుగుపడతాయని వజ్రేష్ యాదవ్ తెలిపారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాగారం డివిజన్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, మాజీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ వర్కింగ్ ప్రెసిడెం ట్ కుమార్, మాజీ కౌన్సిలర్ హరిబాబు, కౌకుట్ల జీవన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, అనిల్ యాదవ్, సోమిరెడ్డి, ఓం సాయిగౌడ్ – మాజీ ప్రజాప్రతి నిధులు – కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## డిజిటల్ ఇండియా పేరుతో ప్రజలను వంచించొద్దు

### బీఆర్ఎస్ నాయకుడు నాయిని ఉదయ్ రంజన్ గౌడ్



మనోహరాబాద్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి నవీన్): యూపీఐ చెల్లింపులపై కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఎండీఆర్ పన్ను విధించడాన్ని బీఆర్ఎస్ నాయకుడు నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ వ్యతిరేకించారు. రూ.2 వేలకుపైగా యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం పన్ను విధిస్తే వ్యాపారులు ఆ భారాన్ని వినియోగదారులపై మోపే అవకాశం ఉందని అన్నారు. దీంతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ పన్ను విధానాన్ని రద్దు చేయాలని నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ డిమాండ్ చేశారు.

## జిన్నారంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం

### 21 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



పటాన్‌చెరు (జిన్నారం), సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): గురుపూజ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిన్నారం మున్సిపల్ కేంద్రంలో మండల ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఎంఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన ఫలితాలు అందించిన 21 మంది ఉత్తమ ఉపాధ్యాయులను మెమెంటో – ప్రశంసాపత్రం – శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయుల సేవలు సమాజ పురోగతికి – విద్యార్థుల భవిష్యత్ రూపకల్పనకు కీలకమని కృష్ణకుమార్ – విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు – ఉపాధ్యాయులు బాల నరసింహారెడ్డి, గంగా కాశీనాథ్, ప్రదీప్, వెంకటరెడ్డి, బ్రహ్మం, అనిల్‌కుమార్, కేశవరావు, రామచందర్, మంగీలాల్, కవిత, సంధ్యారాణి, భవాని, ఉషశ్రీ, శైలజ – పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేద – మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ అండ

### 31 మంది లబ్ధిదారులకు రూ.12.19 లక్షల చెక్కులు పంపిణీ





అల్వాల్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పేద – మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 31 మంది లబ్ధిదారులకు రూ.12.19 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు – ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ సాయం కోసం అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జగదీష్‌గౌడ్, శాంతి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, అనిల్ కిషోర్‌గౌడ్, వీరేశం యాదవ్, అమీనుద్దీన్, ప్రభాకర్‌గౌడ్, చిన్న యాదవ్, శ్రీధర్‌గౌడ్, సురేష్, డోలి రమేష్, వీరేశం వన్, సాయిగౌడ్, రాజేష్‌గౌడ్, నవీన్, సతీష్, భాగ్యనంద్‌రావు, బాలకృష్ణ, నర్సింగరావు, ఉస్మాన్, మారుతి ప్రసాద్, మా శెట్టి హనీల్, వంశీ ముదిరాజ్, హబీబ్ రాజు, నవాబ్, నార్ల సురేష్, విజయ్ శేఖర్, రాజేందర్, వినీత్, లక్ష్మణ్ యాదవ్, మల్లేష్ యాదవ్, సాజిద్, ప్రశాంత్, అరుణ్, రామకృష్ణ, గంగాధర్, శ్రీను – తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్‌రెడ్డి నగర్ పార్క్ అభివృద్ధికి రూ.43 లక్షలు

### బొంతు శ్రీదేవి యాదవ్‌కు కాలనీవాసుల కృతజ్ఞతలు



చర్లపల్లి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): చర్లపల్లి డివిజన్‌లోని వెంకట్‌రెడ్డి నగర్ పార్క్ అభివృద్ధికి రూ.43 లక్షల నిధులు మంజూరు కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. వెంకట్‌రెడ్డి నగర్ – అయ్యప్ప కాలనీ – అంబేద్కర్ నగర్ కాలనీలకు చెందిన పలువురు మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పార్క్ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు ప్రభుగౌడ్, మొగిలి పెంటేష్, శంకర్‌నాయక్, యాదగిరి, వెంకట్‌రెడ్డి, అబ్బయ్య, అశ్విన్‌కుమార్, అభిషేక్, కళ్యాణ్, పవన్, తరుణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

## కీసర సర్కిల్‌లో నేడు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

### ఉదయం 8 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ

కీసర, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17న కీసర సర్కిల్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్ రామలింగం తెలిపారు. ఉదయం 8 గంటలకు తన చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సింగిల్ విండో చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ వార్డు సభ్యులు, మాజీ కోఆప్షన్ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు, గ్రామ ప్రజలు – యువజన సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రామలింగం కోరారు.

## మోదీ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం



నాగారం, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సువర్ణ ఫంక్షన్ హాల్‌లో సెప్టెంబర్ 17న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మిత్ర ఫౌండేషన్ – మిత్ర బ్లడ్ సెంటర్ సౌజన్యంతో – బీజేపీ డివిజన్ 5 ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. యువత – బీజేపీ కార్యకర్తలు – రక్తదానం చేయడానికి ఆసక్తి ఉన్నవారు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పిలుపునిచ్చారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం

### ఎంఈఓ వెంకటస్వామి



మనోహరాబాద్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి నవీన్): గురుపూజ దినోత్సవాన్ని పురస్కరించుకుని మనోహరాబాద్ మండలంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఎంఈఓ వెంకటస్వామి ఆధ్వర్యంలో విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ – ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ఉత్తమ ఉపాధ్యాయులను మెమెంటోలు – ప్రశంసాపత్రాలు – శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని – ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు – మండల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌బీ కాలనీలో కారు బీభత్సం

### మూడు బైకులను ఢీకొట్టి గల్లీలో ఇరుక్కుపోయిన ఐ20 కారు



కుషాయిగూడ, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): హెచ్‌బీ కాలనీ సెకండ్ ఫేజ్‌లో బుధవారం తెల్లవారుజామున ఐ20 కారు బీభత్సం సృష్టించింది. జవహర్‌నగర్ వైపు నుంచి వేగంగా వచ్చిన ఎర్ర రంగు ఐ20 కారు (టీఎస్ 35 ఎఫ్ 5005) ఉదయం 4.30 గంటల సమయంలో ఎంఐజీ–75 వెనుక వీధిలో అదుపుతప్పి రోడ్డుపై పార్క్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. బైకులు తీవ్రంగా దెబ్బతినగా – అనంతరం కారు గల్లీలో అడ్డంగా ఇరుక్కుపోయింది. కారును నడుపుతున్న అమన్ పటేల్ (21)కు ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనపై స్థానికులు కుషాయిగూడ పోలీసులకు సమాచారం ఇవ్వగా – పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

## సూరారం లింగం చెరువులో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

### భద్రత – ట్రాఫిక్ – పారిశుధ్యంపై సీపీ ప్రత్యేక దృష్టి



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): గణేష్ నిమజ్జనం సందర్భంగా సూరారం కట్ట మైసమ్మ లింగం చెరువు – బేబీ పాండు ప్రాంతాల్లో ఏర్పాట్లను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీఎంసీ కమిషనర్ డాక్టర్ సృజనతో కలిసి ట్రాఫిక్ నియంత్రణ – పోలీస్ బందోబస్తు – భక్తుల రాకపోకలు – లైటింగ్ – వైద్య సదుపాయాలు – పారిశుధ్యం – క్రేన్లు – తాగునీటి వసతిపై అధికారులతో సమీక్షించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ – ట్రాఫిక్ – సీఎంసీ – వైద్య – పారిశుధ్య విభాగాలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పరిశీలనలో కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, ట్రాఫిక్ డీసీపీ, సీఎంసీ జోనల్ కమిషనర్ పింకేష్‌కుమార్, అదనపు డీసీపీ పురుషోత్తం, ఏసీపీ బాలగంగిరెడ్డి – వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## క్రిప్టో కరెన్సీ పెట్టుబడి పేరుతో మోసం.. కిడ్నాప్ కేసులో ఏడుగురు అరెస్ట్

### మూడు కార్లు స్వాధీనం.. నిందితులకు రిమాండ్




జగిత్యాల బ్యూరో, సెప్టెంబర్ 16 (నవజ్యోతి): క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెట్టించి మోసానికి పాల్పడ్డాడనే ఆరోపణలతో మానాల మారుతిని కిడ్నాప్ చేసిన కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. చలిగల్ గ్రామానికి చెందిన మారుతి కనిపించకపోవడంతో ఆయన భార్య ఫిబ్రవరి 19న జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 15న పోలీసులను సంప్రదించిన మారుతి – బెజ్జంకి అనిల్‌రావు మరికొందరితో కలిసి తనను కిడ్నాప్ చేసి గుర్తుతెలియని ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేశారని – డబ్బులు ఇవ్వాలని బెదిరించి ఫోన్‌పే ద్వారా నగదు చెల్లించుకున్నారని వాంగ్మూలం ఇచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. తాను నివసిస్తున్న ఇంటిని నిందితులు సూచించిన వ్యక్తుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయాలని – లేకపోతే చంపుతామని బెదిరించినట్లు పేర్కొన్నారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితుడు బెజ్జంకి అనిల్‌రావుతో పాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో అనిల్‌రావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు – మరో వ్యక్తి వ్యాపారి ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి మూడు కార్లను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

### గుర్తింపు కోసం పోలీసుల ప్రయత్నం



వేములపల్లి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): వేములపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోగువారిగూడెం సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువలో బుధవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతురాలి వయస్సు సుమారు 35–40 ఏళ్లు, ఎత్తు ఐదు అడుగులు ఉంటుందని – బూడిద రంగు టాప్, బ్రౌన్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మహిళకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు – ఎవరైనా మిస్సింగ్ అయినట్లు తెలిసిన వారు వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు 8712670190 – పోలీస్‌స్టేషన్ 8712670808 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## డాక్టర్ రఘు కుటుంబాన్ని పరామర్శించిన కల్వకుంట్ల కవిత



మెట్‌పల్లి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): కోరుట్ల నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన ఇన్‌చార్జి డాక్టర్ రఘు తల్లి పుష్పలత ఇటీవల మృతి చెందడంతో పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం మెట్‌పల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పుష్పలత చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి – డాక్టర్ రఘు – కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి పునుగోటి పవన్‌రావు, రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి, ఇస్మాయిల్ – పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సర్కార్ బడిలో యూనిఫామ్ పంపిణీ

### విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేసిన సర్పంచ్ కర్ణె గంగాధర్



చిన్న శంకరంపేట్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి ముకుంద్): చిన్న శంకరంపేట్ మండలం సంగాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ కర్ణె గంగాధర్ యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మీరాజు, పంచాయతీ కార్యదర్శి నిరంజన్‌చారి, వార్డు సభ్యులు తోట కృష్ణ, ఐరేని శిరీష, రాజాగౌడ్, ఉపాధ్యాయురాలు నాగరాణి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు – విద్యార్థులు పాల్గొన్నారు.

## భిక్కనూర్ పోలీస్‌స్టేషన్‌లో అన్నదాన కార్యక్రమం

### గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి.. ఎస్ఐ ఎస్. అనిల్



భిక్కనూర్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భిక్కనూర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, భిక్కనూర్ సీఐ జె. నరేష్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు – గణేష్ ఉత్సవాల యువజన నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్. అనిల్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జన సమయంలో డీజే వినియోగించరాదని – పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

## రైతులు ఎఫ్‌పీఓలో సభ్యత్వం పొందాలి

### పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి



రామచంద్రపురం, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ప్రోత్సహిస్తున్నాయని తెల్లాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి తెలిపారు. తెల్లాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎఫ్‌పీఓలో రైతులు సభ్యత్వం పొందాలని కోరారు. మొత్తం 750 మంది సభ్యులకు అవకాశం ఉండగా ఇప్పటికే 540 మంది సభ్యత్వం పొందారని – మరో 210 మంది రైతులు సభ్యత్వం పొందాల్సి ఉందన్నారు. ఎఫ్‌పీఓ ద్వారా రైతులు సమూహంగా వ్యవసాయ ఉత్పత్తులు – ఎరువులు – విత్తనాలకు సంబంధించిన కార్యకలాపాల్లో భాగస్వాములు కావడంతో పాటు ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.

# బైరాన్‌పల్లిలో అమరవీరులకు ఘన నివాళులు

## తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి: సీపీఐ



గజ్వేల్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): తెలంగాణ సాయుధ పోరాటం 78వ వారోత్సవాల్లో భాగంగా బైరాన్‌పల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించారు. అమరవీరుల స్థూపం – చారిత్రక బురుజు వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ధూల్మిట్ట మండల కన్వీనర్ వలబోజు నర్సింహాచారి అధ్యక్షతన సభ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా బైరాన్‌పల్లి ప్రజలు సాగించిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. 118 మంది అమరులైన బైరాన్‌పల్లి చరిత్రను భావితరాలకు తెలియజేయాలని – బైరాన్‌పల్లి, గుండ్రాంపల్లి పోరాట స్థలాలను స్మృతి చిహ్నాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని – పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కిష్టపురం లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యుడు ఈరి భూమయ్య, మద్దూరు మండల కార్యదర్శి జంగిలి యాదగిరి, బెక్కంటి సంపత్, నంగి కనకయ్య, బైరాన్‌పల్లి శాఖ కార్యదర్శి ఆరుగొండ మల్లేష్, గూడెపు సుదర్శన్, దండబోయిన వెంకటేష్, గోమారపు నర్సయ్య, బంగారు ప్రేమ్‌కుమార్, శిగుళ్ల నరేష్, నంగి సత్తయ్య, కాశబోయిన చరణ్ – మహిళలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాంబే కాలనీలో మోడల్ రైతు బజార్ ప్రారంభం



రామచంద్రపురం, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): భారతీనగర్ డివిజన్ బాంబే కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మోడల్ రైతు బజార్ షాపులను బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్‌రెడ్డి – అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్ ప్రారంభించారు. ఆదివారం నుంచి కూరగాయలు – పండ్లు – నాన్‌వెజ్ తదితర సరుకుల విక్రయాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ఆదర్శ్‌రెడ్డి షాపు కేటాయింపుదారులను కోరారు. మిగిలిన షాపులకు త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి రైతు బజార్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సింధు ఆదర్శ్‌రెడ్డి అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు – షాపు కేటాయింపుదారులు పాల్గొన్నారు.

## వాసవి వినాయక్ నగర్‌లో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు



గజ్వేల్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 20వ వార్డు వాసవి వినాయక్ నగర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు ప్రముఖ వ్యాపారవేత్తలు నేతి సంతోష్ – శ్రీలత దంపతులు, అమరేందర్ – సంధ్య దంపతులు, మానస – రమేష్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి గణపతి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహంకాళి శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఉత్తునూరు మోహన్‌బాబు, యువ నాయకుడు స్వామి గణపతి నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని – సహకరిస్తున్న ప్రతి ఒక్కరిపై స్వామివారి అనుగ్రహం ఉండాలని అన్నారు. కార్యక్రమంలో అల్లాడి శ్రీనివాస్, నాగరాజు, గంగిశెట్టి పవన్, తోట మల్లయ్య, నరేష్, కాలనీవాసులు – మహిళలు – చిన్నారులు – యువకులు పాల్గొన్నారు.

## కొల్లూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం




రామచంద్రపురం, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): కొల్లూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఓపెన్ స్కూల్ 10వ తరగతి – ఇంటర్మీడియట్ కోర్సుల అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 30 వరకు ప్రవేశాలకు అవకాశం ఉందని జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి – ప్రిన్సిపాల్ దిలీప్ సింగ్ తెలిపారు. 14 నుంచి 60 ఏళ్ల వయస్సు గల అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ అజ్మతుల్లా బుధవారం కేసీఆర్ నగర్ ఫేజ్–1 – ఫేజ్–2 డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి అర్హులైన యువతీ యువకులు అడ్మిషన్లు పొందాలని సూచించారు.

## యూజీడీ సమస్యపై జీఎం మాధవికి వినతి

### ఎమ్మెల్యే స్పందన.. అధికారులకు ఆదేశాలు



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): సాయిబాబానగర్ 292 డివిజన్ పరిధిలోని ఆర్‌జీకే 1 నుంచి 14 బ్లాకులు – సుందర్‌నగర్‌లో యూజీడీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వారాల వినోద్‌కుమార్ తెలిపారు. సమస్య తీవ్రతను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పాదయాత్ర నిర్వహించి పరిశీలించిన అనంతరం అధికారులతో మాట్లాడారు. సమస్యను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానందగౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సూచన మేరకు వారాల వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో జీఎం మాధవికి వినతిపత్రం అందజేసి యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ ముదిరాజ్, జై సింహారెడ్డి, బద్రి, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

### ట్రాఫిక్ – భద్రత – మౌలిక సదుపాయాలపై అధికారులకు సూచనలు








కామారెడ్డి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): గణేష్ నిమజ్జన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఐఏఎస్ – జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఐపీఎస్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్రాఫిక్ గణపతిని దర్శించుకున్న అనంతరం అధికారులు – మున్సిపల్ చైర్‌పర్సన్ – గణేష్ ఉత్సవ సమితుల ప్రతినిధులతో కలిసి ప్రత్యేక బస్సులో నిమజ్జన రూట్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ – రహదారులు – విద్యుత్ లైన్లు – వీధి దీపాలు – పారిశుద్ధ్యం – తాగునీరు – బారికేడ్లు – అత్యవసర మార్గాల సమస్యలను నిమజ్జనానికి ముందే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు – రెస్క్యూ బృందాలు – వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేష్ నవరాత్రులు పూర్తయ్యే వరకు సీసీ కెమెరాలు – డ్రోన్లతో నిఘా కొనసాగుతుందని తెలిపారు. డీజేలకు స్వస్తి పలికి సాంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు నిర్వహించాలని ఎస్పీ రాజేష్ చంద్ర కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై. గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, సీఐ నరహరి – తదితరులు పాల్గొన్నారు.

## తల్లి – బిడ్డ ఆరోగ్యానికి తొలి 1000 రోజులు కీలకం

### పౌష్టికాహారం – టీకాలపై తల్లిదండ్రులకు అవగాహన

రామాయంపేట, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి శిశువు పుట్టిన తర్వాత రెండేళ్ల వరకు ఉన్న తొలి 1000 రోజులు తల్లి – బిడ్డ ఆరోగ్యానికి ఎంతో కీలకమని సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి తెలిపారు. రామాయంపేట సీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ సృజన – సీడీపీఓ స్వరూప రాథోడ్ మాట్లాడారు. గర్భిణులు – బాలింతలు – చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని – వైద్యుల సూచనల మేరకు మందులు – పోషక పదార్థాలు వినియోగించాలని సూచించారు. చిన్నారులకు వయస్సుకు తగిన ఆహారం అందిస్తూ ఎదుగుదలను పర్యవేక్షించాలని – నిర్ణీత సమయంలో టీకాలు వేయించాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో ఆకుకూరలు – కూరగాయలు పెంచుకోవాలని సూచించారు. పౌష్టికాహారం – పరిశుభ్రత – టీకాలు – ఆరోగ్య పరీక్షల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా వైద్య సిబ్బంది సూచనలు పాటించాలని డాక్టర్ లింబాద్రి కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది – తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నవజ్యోతి
తెలుగు దినపత్రిక
navajyothidaily.com

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**రూ.5 వేల సాయం అందించిన గట్టు ప్రశాంత్**



రామాయంపేట, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): రామాయంపేట మండలం రాయిలాపూర్‌కు చెందిన ఉప్పరి రామవ్వ ఇటీవల మృతి చెందడంతో ప్రముఖ సంఘ సేవకుడు గట్టు ప్రశాంత్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొని – గట్టు ప్రశాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోమిరె లాజరు, టంకరి దాస్, టంకరి తిరుమలయ్య, గౌరు బాల నరసింహులు, ఎడ్ల ఎలిషా, టంకరి సంజీవ్ – మృతురాలి కుటుంబ సభ్యులు – గ్రామస్థులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా ప్రచారం కాదు.. ఉద్యోగాల లెక్క చెప్పాలి

**గత మేళా ఫలితాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: బీఆర్ఎస్ నాయకుడు అనంతుల ఆంజనేయులు**



నడిగూడెం, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): యువతకు జాబ్ మేళాల ప్రచారం కాకుండా నియామక పత్రాలు అందించాలని బీఆర్ఎస్ మండల సమన్వయ కమిటీ సభ్యుడు అనంతుల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ నెల 19న కోదాడలో నిర్వహించనున్న జాబ్ మేళాకు ముందు హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి – ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మేళా ఫలితాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఎన్ని కంపెనీలు పాల్గొన్నాయి – ఎంతమందికి నియామక పత్రాలు ఇచ్చారు – ఎంతమంది విధుల్లో చేరారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ సిమెంట్ పరిశ్రమల్లో స్థానిక యువతకు కల్పించిన ఉద్యోగాల వివరాలు చెప్పాలని కోరారు. లస్కర్ ఉద్యోగాల పేరుతో ఏజెన్సీ ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.2.80 లక్షల వరకు వసూలు చేసిందన్న ఆరోపణలపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. ఉద్యోగ ఖాళీల భర్తీకి ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బోనగిరి ఉపేందర్, యాలగొండ నాగేశ్వరరావు, దున్న రవి, ఎస్కే జలీల్, ఎస్కే గౌస్, ఎస్కే మౌలానా, దున్న ప్రవీణ్, మేకల వీరబాబు, చిత్తలూరి రవి తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు


**చెన్నకేశవపురంలో కొత్త బోరు ఏర్పాటు.. ఎస్సీ – బీసీ కాలనీలకు నీటి విడుదల**



నడిగూడెం, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): చెన్నకేశవపురం గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ గోసుల రాజేష్ తెలిపారు. అధికారుల సహకారం – పంచాయతీ పాలకవర్గం తోడ్పాటుతో నూతన బోరుబావిని ఏర్పాటు చేసి ఎస్సీ – బీసీ కాలనీల పైప్‌లైన్‌కు అనుసంధానం చేసి నీటి సరఫరా ప్రారంభించినట్లు చెప్పారు. సమస్య తీవ్రం కాకముందే పరిష్కారం చూపడంపై కాలనీవాసులు సర్పంచ్ – పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి. సురేష్, ఉప సర్పంచ్ కటికల్లా పుల్లయ్య, వార్డు సభ్యులు – గ్రామ పెద్దలు – స్థానికులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడిగా మిర్యాల శ్రీనుగౌడ్

**ఏకగ్రీవ ఎన్నికపై ఘన సన్మానం**



నడిగూడెం, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): నడిగూడెం మండల వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రత్నవరం గ్రామానికి చెందిన రేణుకేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మిర్యాల శ్రీనుగౌడ్‌ను స్థానిక నాయకులు – ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. తాజా మాజీ సర్పంచ్ పగడాల పద్మ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దాట్ల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై శ్రీనుగౌడ్‌ను అభినందించారు. గ్రామాభివృద్ధి – ప్రజా సమస్యల పరిష్కారంలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని – మండల స్థాయి సమస్యల పరిష్కారానికి శ్రీనుగౌడ్ కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసుపులేటి వినయ్ వర్ధన్ నాయుడు, మాజీ ఉపసర్పంచ్ మొలుగురి ఉపేందర్, సోమ వీరయ్య, సోమ సీతమ్మ, వార్డు సభ్యులు రామిని భూపాల్‌రెడ్డి, కూరాకుల వెంకటేశ్వర్లు, కలకొండ లక్ష్మి వీరయ్య, బెల్లంకొండ ఉమా రాంబాబు, కళాకారులు మొలుగురి సురేష్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పల్లి సంజీవరెడ్డి, పగడాల రామకృష్ణారెడ్డి, వి.ఎల్.ఎన్. గౌడ్, పగడాల బుచ్చిరెడ్డి, యరగాని వీరబాబు, మిర్యాల గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి పట్టణ అభివృద్ధికి రూ.200 కోట్ల నిధులు

**సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు సాధిస్తా: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**



కామారెడ్డి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి పట్టణ సమగ్ర అభివృద్ధికి రూ.200 కోట్ల నిధులు మంజూరు చేయించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప శ్రీనివాస్ ఉమారాణి – కౌన్సిలర్లు – మున్సిపల్ అధికారులు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని రోడ్లు – డ్రైనేజీ – తాగునీరు – పారిశుద్ధ్యం – వీధి దీపాలు – పార్కులు – ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు అవసరమని వివరించారు. ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు సాధించేందుకు కృషి చేస్తానని షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. పెరుగుతున్న జనాభా – భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. మంజూరైన నిధులతో నాణ్యమైన పనులు జరిగేలా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అంజద్, షేరు, అన్వర్, కళ్లెం సత్యం, చిట్టిబాబు, సాయిలు, మాజీద్, లడ్డు, గోనె శ్రీనివాస్, అలీ బిన్ అబ్దుల్లా, భూపతి, సిద్ధిక్, యూనిస్, వాజిద్, కాళ్ల గణేష్, మహేష్, తాటి ప్రసాద్, మోతిలాల్, రామ్మోహన్, జావేద్ – మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# రత్నవరంలో ఘనంగా సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు

**చరిత్రను మతంతో ముడిపెట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలి: బెల్లంకొండ వెంకటేశ్వర్లు**



నడిగూడెం, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం హిందూ – ముస్లింల మధ్య జరిగినది కాదని, భూమి – భుక్తి – వెట్టిచాకిరీ విముక్తి కోసం నైజాం సర్కార్ – రజాకార్లు – జమీందార్లకు వ్యతిరేకంగా సాగిన వర్గ పోరాటమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. రత్నవరంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. నాటి పోరాటాన్ని మత కలహంగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని – నాలుగు వేల గ్రామాలు విముక్తి పొందాయని – నాలుగు వేల మందికి పైగా అమరులయ్యారని పేర్కొన్నారు. భూములు – ఇళ్ల స్థలాలు – సంక్షేమం కోసం నాటి పోరాట స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు నిర్మించాలని కోరారు. కార్యక్రమానికి ముందు పోరాట యోధులు పగడాల రాంరెడ్డి, కన్నెబోయిన లింగయ్య, కన్నెబోయిన నరసయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి కన్నెబోయిన సైదయ్య, మొలుగురి సురేష్, పగడాల బుచ్చిరెడ్డి, సోమా వీరయ్య, కాసాని శ్రీనివాసరావు, కూరాకుల కృష్ణమూర్తి, పల్లి సంజీవరెడ్డి, కన్నెబోయిన భాస్కరరావు, కన్నెబోయిన ఉప్పలయ్య, మొలుగురి సైదులు, వార్డు సభ్యులు మిర్యాల శ్రీను, కూరాకుల వెంకటేశ్వర్లు, రామిని భూపాల్‌రెడ్డి, బెల్లంకొండ రాంబాబు, కలకొండ వీరయ్య, మొలుగురు ఉపేందర్, పగడాల శ్రీనివాస్‌రెడ్డి, వీఎల్ఎన్ గౌడ్, రామిని నర్సిరెడ్డి, కూరాకుల శ్రీరాములు, పగడాల రామకృష్ణారెడ్డి, పోలంపల్లి చిన్న వీరయ్య, మిర్యాల గురుస్వామి, రాజుల వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ నగర్‌లో నేడు విశ్వకర్మ జయంతి

**ఉదయం 10 గంటలకు పూజలు – అనంతరం అన్నదానం**




రామచంద్రపురం, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): కొల్లూర్ కేసీఆర్ నగర్‌లోని ఎల్లమ్మ – పోచమ్మ ఆలయ స్థలంలో నేడు శ్రీ విశ్వకర్మ జయంతి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విరాట్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పూజలు ప్రారంభం కానున్నాయి. 1 నుంచి 117 బ్లాకులకు చెందిన విశ్వకర్మ సోదరులు – లబ్ధిదారులు పాల్గొని జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

# భిక్కనూరులో మండల సర్వసభ్య సమావేశం



భిక్కనూరు, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): భిక్కనూరు మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సవితారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి – మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ హాజరయ్యారు. సమావేశంలో తహశీల్దార్ సునీత, మండల పరిషత్ అధికారి రాజ్‌కిరణ్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి రాజ గంగారెడ్డి – వివిధ గ్రామాల సర్పంచులు – మండల స్థాయి అధికారులు – గ్రామ కార్యదర్శులు పాల్గొని పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.

# మైనారిటీ మహిళలకు రూ.50 వేల ఆర్థిక సాయం

**ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద చెక్కుల పంపిణీ**

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): మహిళా సాధికారత – స్వయం ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన' కింద ఐదుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున మొత్తం రూ.2.50 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ ఆర్థిక సాయంతో మహిళలు చిన్నతరహా వ్యాపారాలు – స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకుని కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం తుర్క కాశ మైనారిటీ వర్గాల జీవనోపాధి కోసం స్టోన్ కటింగ్ జనరేటర్లు – టూల్ కిట్లను అందజేశారు. ఆధునిక పరికరాలతో శ్రమ తగ్గి – తక్కువ సమయంలో ఎక్కువ పని చేసి ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పోతుల రాజేందర్, కాశీనాథ్ యాదవ్ పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి పేదలకు కొండంత అండ

**పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే నిరుపేదలకు సీఎం సహాయ నిధి భరోసాగా నిలుస్తుందని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. వెంకటేశ్వర నగర్ డివిజన్ ఆస్బెస్టాస్ కాలనీకి చెందిన నర్సింహమూర్తి వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం రూ.1.75 లక్షల విలువైన ఎల్‌వోసీ మంజూరు చేసింది. మంజూరు పత్రాన్ని గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వినోద్‌రావు – మిర్యాల ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు దక్కేలా చూడాలని ఫతేనగర్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ఫతేనగర్ డివిజన్‌లోని ఐదు పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ కింద నోటీసులు అందుకున్న ఓటర్లను గుర్తించి అవసరమైన పత్రాలను సేకరించాలని – బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లు – పోలింగ్ కేంద్రాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్ల జాబితాలను దరఖాస్తు ఫారాలతో కలిపి బూత్ ఇన్‌చార్జిలకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కంచి భిక్షపతి, తూము జగదీష్, డేవిడ్, అన్వర్ జావేద్, నాగేష్, మల్లేష్, కుమారి, జనార్ధన్, రాము గౌడ్ – ఐదు బూత్‌ల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

# ఒక తేదీ... అనేక జ్ఞాపకాలు

- తెలంగాణ విమోచన దినోత్సవం గుర్తు చేసేది ఒక పాలన ముగిసిన రోజు మాత్రమే కాదు...
- స్వేచ్ఛ కోసం ప్రాణాలు అర్పించిన వేలాది మంది కన్నీటి చరిత్ర



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నవజ్యోతి ఎడిటోరియల్):

సెప్టెంబర్ 17... క్యాలెండర్‌లో ఒక తేదీ మాత్రమే కాదు. దాని వెనుక ఒక సుదీర్ఘ పోరాటం ఉంది. ఆ పోరాటం వెనుక వేలాది కుటుంబాల కన్నీళ్లు ఉన్నాయి. స్వేచ్ఛ కోసం, హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన సామాన్య ప్రజల త్యాగం ఉంది. అందుకే సెప్టెంబర్ 17ను కేవలం జెండా ఎగురవేసి, నినాదాలు చేసి, సభ ముగిసిన తర్వాత మరిచిపోయే రోజుగా చూడలేం. "మనకు ఈ స్వేచ్ఛ ఎలా వచ్చింది?" అని మనల్ని మనమే ప్రశ్నించుకోవాల్సిన రోజు ఇది.

### ఆగస్టు 15 వచ్చింది... కానీ హైదరాబాద్‌కు సంపూర్ణ స్వేచ్ఛ రాలేదు

1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. దేశమంతా సంబరాల్లో మునిగిపోయింది. కానీ హైదరాబాద్ సంస్థాన ప్రజలకు మాత్రం ఆ రోజుతోనే సంపూర్ణ స్వేచ్ఛ లభించలేదు. నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా కొనసాగాలని కోరుకున్నాడు. మరోవైపు ప్రజలు ప్రజాస్వామ్య హక్కులు, బాధ్యతాయుత ప్రభుత్వం, భారత యూనియన్‌లో విలీనం కోసం ఉద్యమాలను బలోపేతం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య పెత్తందారీ, వెట్టిచాకిరి, అధిక భారం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా అసంతృప్తి పెరిగింది. ప్రజల గొంతు నొక్కబడుతున్న పరిస్థితుల్లో హక్కుల కోసం నిలబడటం సాహసంగా మారింది.దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ ప్రజలకు స్వేచ్ఛ కోసం మరో పోరాటం ఎందుకు అవసరమైందన్నదే సెప్టెంబర్ 17 చరిత్రలోని తొలి ప్రశ్న.

### – రజాకార్ల నీడ... ప్రజల భయంకర జీవితం

హైదరాబాద్ సంస్థానంలో రజాకార్ దళాల కార్యకలాపాలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ప్రజాస్వామ్య ఉద్యమాలు, విలీన ఉద్యమాలు, రైతాంగ పోరాటాలను అణచివేసే క్రమంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి.అయితే ఈ చరిత్రను కేవలం ఒక మతానికి – మరో మతానికి మధ్య జరిగిన పోరాటంగా చూడటం సరైంది కాదు. నిజాం పాలనను వ్యతిరేకించిన ఉద్యమాల్లో వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యం, భూమి, స్వేచ్ఛ, ఆత్మగౌరవం కోసం అనేక మంది పోరాడారు.ఇది కేవలం అధికార మార్పు కథ కాదు... ప్రజల హక్కుల కోసం సాగిన పోరాటం.

### – బైరాన్‌పల్లి... ఆ బురుజు ఇప్పటికీ ప్రశ్నిస్తోంది

తెలంగాణ పోరాట చరిత్రలో బైరాన్‌పల్లి ఒక విషాద జ్ఞాపకం. గ్రామాన్ని రక్షించుకునేందుకు ప్రజలు రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు. రజాకార్ల దాడులను ఎదుర్కొన్నారు. 1948 ఆగస్టు 27న జరిగిన దాడి తీవ్ర విషాదానికి దారితీసింది. కేంద్ర ప్రభుత్వ ప్రచురణల్లో ఈ ఘటనలో 90 మందికి పైగా మరణించినట్లు నమోదు ఉంది.ఒక్కసారి ఆలోచిస్తే గుండె బరువెక్కుతుంది. అక్కడ కోల్పోయింది కేవలం కొన్ని ప్రాణాలు కాదు. ఎన్నో కుటుంబాల భవిష్యత్తు చీకటైంది. తల్లుల ఒడులు ఖాళీ అయ్యాయి. పిల్లలు తండ్రులను కోల్పోయారు.స్వేచ్ఛ కోసం చెల్లించిన ఆ రక్తపు ధరను మనం గుర్తుంచుకున్నామా?బైరాన్‌పల్లి బురుజు నేడు కేవలం ఒక చారిత్రక కట్టడం కాదు. ఆ కాలపు బాధకు మౌన సాక్ష్యం.

### – పరకాల... జెండా పట్టుకున్న చేతుల విషాదం

ప్రజాస్వామ్య హక్కులు, జాతీయ జెండా కోసం ప్రజలు కదిలిన సందర్భంలో పరకాలలో జరిగిన కాల్పులు తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేశాయి. కేంద్ర ప్రభుత్వ అధికారిక ప్రచురణల్లో ఈ ఘటనలో సుమారు 30 మంది మరణించినట్లు ప్రస్తావన ఉంది.చేతిలో ఆయుధం కాదు... జెండా. గొంతులో నినాదం. ఎదుట తుపాకులు.ఆ జెండా స్వాతంత్ర్యానికి ప్రతీక. కానీ దాని వెనుక చరిత్రలో కలిసిపోయిన రక్తపు చారలను కూడా గుర్తు చేసుకోవాలి.దొడ్డి కొమురయ్య... రైతు గుండెల్లో తిరుగుబాటు

### – 1946 జూలై 4... కడవెండి... దొడ్డి కొమురయ్య.

భూస్వామ్య పెత్తందారీకి, అన్యాయానికి వ్యతిరేకంగా సాగిన రైతాంగ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి తొలి అమరుడిగా గుర్తించబడతాడు.అతని చేతిలో అధికారం లేదు. పెద్ద పదవి లేదు. కానీ అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం ఉంది. ఆ ధైర్యమే ఒక ఉద్యమానికి ప్రతీకగా మారింది.చరిత్రలో కొందరి పేర్లు అధికార పత్రాల్లో నిలుస్తాయి. మరికొందరి పేర్లు ప్రజల గుండెల్లో నిలుస్తాయి. కొమురయ్య పేరు రెండో జాబితాలో శాశ్వతం.

### – చాకలి ఐలమ్మ... ఒక మహిళ నిలబడితే

తన భూమి – తన పంటపై హక్కు కోసం భూస్వామ్య పెత్తందారీకి ఎదురు నిలిచిన చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాట చరిత్రలో మహిళా ధైర్యానికి ప్రతీకగా నిలిచింది.ఆమె చేతిలో పెద్ద ఆయుధం లేదు. కానీ తన హక్కును వదులుకోని ఆత్మవిశ్వాసం ఉంది. ఒక మహిళ అన్యాయానికి ఎదురు నిలబడితే, ఆ ధైర్యం మరెందరో మహిళలకు స్ఫూర్తిగా మారుతుందన్న విషయాన్ని ఐలమ్మ పోరాటం గుర్తు చేస్తుంది.తన భూమి కోసం నిలబడిన ఒక మహిళ... ఒక తరం ఆత్మగౌరవానికి ప్రతీకగా మారింది.

### – కొమురం భీమ్... అడవి నుంచి వినిపించిన హక్కుల స్వరం

తెలంగాణ ఆదివాసీ పోరాట చరిత్రలో కొమురం భీమ్ పేరు ప్రత్యేకమైనది. జల్ – జంగల్ – జమీన్ అనే హక్కుల భావనతో ఆదివాసీల భూమి, అడవి, జీవన హక్కుల కోసం ఆయన పోరాడాడు. 1940లో జోడేఘాట్ వద్ద అమరుడయ్యాడు.ఆయన పోరాటం 1948 సెప్టెంబర్ 17కు ముందే జరిగినప్పటికీ, తెలంగాణలో స్వేచ్ఛ – ఆత్మగౌరవం – హక్కుల కోసం సాగిన విస్తృత పోరాటానికి ముఖ్యమైన నేపథ్యంగా నిలిచింది.భూమి, అడవి, జీవన హక్కులు కోల్పోతే మనిషి తన ఆత్మగౌరవాన్ని కూడా కోల్పోతాడని భీమ్ పోరాటం గుర్తు చేస్తుంది.

### – పేర్లు కొన్నే... త్యాగాలు వేల

ఈ చరిత్రలో కొమురం భీమ్ ఉన్నాడు. దొడ్డి కొమురయ్య ఉన్నాడు. చాకలి ఐలమ్మ ఉంది. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, కాళోజీ నారాయణరావు, స్వామి రామానందతీర్థ వంటి నాయకులు ఉన్నారు.అనభేరి ప్రభాకరరావు, షోయబుల్లాఖాన్, వందేమాతరం రామచంద్రరావు, తుర్రేబాజ్‌ఖాన్, రాంజీగోండ్, భాగ్యరెడ్డి వర్మ, నారాయణరావు పవార్, జగదీశ్ ఆర్య, గండయ్య ఆర్య వంటి పోరాట యోధుల పేర్లు కూడా ఈ చరిత్రలో భాగమే.కానీ పేర్లు గుర్తున్నవారు కొందరే. చరిత్ర పుస్తకాల్లో పేర్లు లేకుండానే ప్రాణాలు అర్పించిన వారు వేలాది మంది.చరిత్రను నాయకులు మాత్రమే రాయరు. కొన్నిసార్లు సామాన్య ప్రజలు తమ రక్తంతో రాస్తారు.

### – షోయబుల్లాఖాన్... కలం కూడా ఒక ఆయుధమే

హైదరాబాద్ పత్రికా చరిత్రలో షోయబుల్లాఖాన్ పేరు ప్రత్యేకంగా నిలుస్తుంది. నిజాం పాలన – రజాకార్ల విధానాలను విమర్శిస్తూ రాసిన ఆయన తన కలం ద్వారా అధికారాన్ని ప్రశ్నించాడు. చివరకు తన రచనా ధైర్యానికి ప్రాణాలు కోల్పోయాడు.ఆయన చేతిలో తుపాకీ లేదు. కలం ఉంది.అధికారాన్ని ప్రశ్నించే స్వరాన్ని అణచివేయవచ్చని భావించినా, ఆలోచనను అంతం చేయడం సాధ్యం కాదని ఆయన చరిత్ర చెబుతుంది.ఒక జర్నలిస్టు ప్రాణాన్ని తీసుకోవచ్చు... కానీ అతను లేవనెత్తిన ప్రశ్నను చరిత్ర నుంచి చెరిపేయడం అంత సులభం కాదు.

### – సర్దార్ పటేల్... చరిత్రలో కీలక మలుపు

హైదరాబాద్ సంస్థాన సమస్యకు రాజకీయ – దౌత్య పరిష్కారం కోసం భారత ప్రభుత్వం ప్రయత్నించింది. పరిస్థితులు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో 1948 సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలో ప్రారంభమైంది. సెప్టెంబర్ 17న నిజాం కాల్పుల విరమణకు అంగీకరించడంతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడానికి కీలక మలుపు ఏర్పడింది.అప్పటి ఉపప్రధాని – హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు.అయితే సెప్టెంబర్ 17ను అర్థం చేసుకోవడం అంటే కేవలం ఒక నాయకుడి పాత్రను గుర్తు చేసుకోవడం కాదు. ఆ నిర్ణయం అవసరమయ్యే స్థాయికి పరిస్థితులు ఎందుకు చేరుకున్నాయి? ప్రజలు ఎందుకు ఉద్యమించారు? ఎందుకు ప్రాణాలు కోల్పోయారు? అనే ప్రశ్నలకు కూడా సమాధానం వెతకాలి.

### – సెప్టెంబర్ 17... ముగింపు మాత్రమే కాదు

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానంలో ఒక పాలనా అధ్యాయం ముగిసింది. కానీ ప్రజల కష్టాలు ఒక్క రోజులో ముగియలేదు. ఆ తరువాత కూడా హింస, ప్రతీకార దాడులు, మతపరమైన ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.అందుకే ఈ చరిత్రను కేవలం ఒక కోణంలో చూడటం కంటే, ఆ కాలంలో జరిగిన మొత్తం మానవ విషాదాన్ని గుర్తు చేసుకోవాలి.ఒకరి విజయాన్ని గుర్తించడానికి మరొకరి విషాదాన్ని చెరిపేయాల్సిన అవసరం లేదు. అదే చరిత్ర పట్ల నిజాయితీ.

### మతాల మధ్య పోరాటంగా చూడకూడదు

సెప్టెంబర్ 17ను ఒక మతం గెలిచిన రోజు – మరో మతం ఓడిన రోజుగా చూపించడం చరిత్రను అతిగా సరళీకరించడం అవుతుంది.నిజాం పాలనను వ్యతిరేకించిన వారిలో వివిధ వర్గాల ప్రజలు ఉన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడిన ముస్లింలూ ఉన్నారు. రజాకార్ల హింసకు గురైన హిందువులూ ఉన్నారు. రైతాంగ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన గ్రామీణ ప్రజలూ ఉన్నారు.అందుకే ఈ చరిత్రను మతాల మధ్య పోరాటంగా కాకుండా ప్రజల హక్కులు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, భూమి, ఆత్మగౌరవం కోసం సాగిన సంక్లిష్ట పోరాటంగా చూడాలి.

**ఎనిమిది దశాబ్దాల తర్వాత... మన ప్రశ్న ఏమిటి?**
**1948లో ఒక తరం అడిగిన ప్రశ్న...**
**"మనకు స్వేచ్ఛ ఎప్పుడు వస్తుంది?"**
**నేడు మన తరం అడగాల్సిన ప్రశ్న...**
**"వచ్చిన స్వేచ్ఛను మనం ఎంతవరకు కాపాడుతున్నాం?"**

మనకు ఓటు హక్కు ఉంది. మాట్లాడే హక్కు ఉంది. ప్రశ్నించే హక్కు ఉంది. పత్రికలు ఉన్నాయి. న్యాయస్థానాలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ఉంది.కానీ పేదవాడి గొంతు నిజంగా వినిపిస్తున్నదా? రైతు తన సమస్యపై నిర్భయంగా మాట్లాడగలుగుతున్నాడా? ఒక మహిళ తన హక్కు కోసం ఒంటరిగా నిలబడగలుగుతున్నదా? ఒక జర్నలిస్టు అధికారాన్ని ప్రశ్నించగలుగుతున్నాడా? ఒక విద్యార్థి భయపడకుండా తన అభిప్రాయాన్ని చెప్పగలుగుతున్నాడా?

ఈ ప్రశ్నలకు మన సమాజం ఇచ్చే సమాధానమే సెప్టెంబర్ 17కు నిజమైన నివాళి.పేర్లు వేరు... జ్ఞాపకం మాత్రం ఒక్కటేసెప్టెంబర్ 17ను ఏ పేరుతో పిలవాలన్నదానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ రోజును ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ విమోచన దినంగా నిర్వహిస్తోంది.పేర్లపై రాజకీయ చర్చ కొనసాగవచ్చు. కానీ ఆ పేర్ల వెనుక ఉన్న ప్రజల బాధను మాత్రం మర్చిపోకూడదు.బైరాన్‌పల్లిలో ప్రాణాలు కోల్పోయిన వారిని మర్చిపోకూడదు. పరకాలలో జెండా పట్టుకున్న చేతులను మర్చిపోకూడదు. కడవెండిలో పడిపోయిన దొడ్డి కొమురయ్యను మర్చిపోకూడదు. హక్కు కోసం నిలబడిన చాకలి ఐలమ్మను మర్చిపోకూడదు. అడవి – భూమి – ఆత్మగౌరవం కోసం పోరాడిన కొమురం భీమ్‌ను మర్చిపోకూడదు. కలం కోసం ప్రాణం ఇచ్చిన షోయబుల్లాఖాన్‌ను మర్చిపోకూడదు.

### ముఖ్యంగా...

**చరిత్ర పుస్తకాల్లో పేరు లేకుండానే ప్రాణాలు అర్పించిన ఆ వేలాది మంది సామాన్యులను మర్చిపోకూడదు.**

**ఒక తేదీ కాదు... ఒక బాధ్యత**

**సెప్టెంబర్ 17 మనకు ఒక తేదీ మాత్రమే కాదు. ఒక జ్ఞాపకం. ఒక హెచ్చరిక. ఒక బాధ్యత.**

**1948లో ఒక తరం అడిగింది...**
**"మాకు స్వేచ్ఛ ఎప్పుడు?"**
**ఇప్పుడు మన తరం తనను తాను అడగాలి...**

"మాకు వచ్చిన స్వేచ్ఛను రేపటి తరానికి మరింత సురక్షితంగా అందిస్తున్నామా?"ఆ ప్రశ్నకు మన జీవితం సమాధానం కావాలి.విమోచనం అంటే ఒక పాలకుడు వెళ్లిపోవడం మాత్రమే కాదు. భయం నుంచి విముక్తి. అన్యాయం నుంచి విముక్తి. వెట్టిచాకిరి నుంచి విముక్తి. పెత్తందారీ నుంచి విముక్తి. నిరంకుశత్వం నుంచి విముక్తి. ద్వేషం నుంచి విముక్తి. బలహీనుడు బలవంతుడి ముందు తలవంచాల్సిన పరిస్థితి నుంచి విముక్తి.చివరికి... మనిషి తన ఆత్మగౌరవంతో, భయంలేకుండా జీవించగలగడమే నిజమైన విమోచనం.1948లో మొదలైన ఆ ప్రయాణం చరిత్రలో ఒక మలుపు తిరిగింది. కానీ స్వేచ్ఛను కాపాడే బాధ్యత ప్రతి తరానికీ కొనసాగుతూనే ఉంటుంది.తేదీని గుర్తుంచుకోవడం చరిత్ర. త్యాగాన్ని గుర్తుంచుకోవడం కృతజ్ఞత. చరిత్ర నుంచి నేర్చుకోవడం బాధ్యత. స్వేచ్ఛను కాపాడటం... అమరులకు మనం చెల్లించాల్సిన నిజమైన నివాళి.

సాయి మణికంఠ చికోటి
మేనేజింగ్ ఎడిటర్, నవ జ్యోతి తెలుగు డైలీ

## కరెంట్ పోల్ సమస్యను వెంటనే పరిష్కరించాలి:దొడ్ల వెంకటేష్ గౌడ్



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్ కాలనీ బ్లాక్ నంబర్ 50లో భవనానికి ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం సమస్యను వెంటనే పరిష్కరించాలని ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ విద్యుత్ శాఖ అధికారులను కోరారు. భవనానికి ఆనుకుని కరెంట్ పోల్ ఉండటంతో తరచూ ఎర్తింగ్ సమస్య తలెత్తుతోందని – ప్రమాదం జరిగే అవకాశం ఉందని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన వెంకటేష్‌గౌడ్ విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజల భద్రత దృష్ట్యా సమస్యను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, మల్లేష్ – పీజేఆర్ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఐక్యత – సోదరభావాన్ని చాటే పండుగ వినాయక చవితి:టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్




కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక చవితి ప్రజల్లో భక్తి భావం – ఐక్యత – సోదరభావాన్ని పెంపొందిస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు – కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మూసాపేట్ డివిజన్‌లో తూము రజినీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. ప్రజలందరికీ సుఖసంతోషాలు – విజయాలు కలగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పుష్పారెడ్డి, తూము సంతోష్, ఎల్లారావు, సతీష్‌గౌడ్, కర్రెమ్మ, ఇజాజ్, వాసు తదితరులు పాల్గొన్నారు

## గణనాథుడికి 54 రకాల ప్రసాదాలు



హత్నూర,సెప్టెంబర్16: (నవ జ్యోతి ప్రతినిధి): మండల కేంద్రమైన హత్నూర లో బ్లూ స్టార్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి మండపం వద్ద భక్తులు బుధవారం పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడవరోజు గణనాథుడికి భక్తులు 54 రకాల వంటకాలతో ప్రసాదాలు సమర్పించారు. అనంతరం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.